సాక్షి
జగిత్యాల
మంగళవారం । 14 । మార్చి । 2023



దుర్గామాతకు పూజలు

మల్లాపూర్ : దుర్గాదేవీ ఆలయ తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా శ్రీ దుర్గాదేవీ-కనకసోమేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిపించారు.



పాఠశాలల సందర్శన

కథలాపూర్ : తొలిమెట్టు పర్యవేక్షణ జిల్లా బృందం సోమవారం బొమ్మెన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల ప్రగతిపై ఆరా తీసింది.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
35.0/19.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది.

దారితప్పుతున్న వీడీసీలు!

- మాట వినకుంటే సామాజిక బహిష్కరణ
- అసాంఘిక కార్యకలాపాల్లోనూ భాగస్వాములు
- చట్టవ్యతిరేకంగా బెల్ట్‌షాపులకు వేలం పాటలు
- గ్రామాల్లో అనాగరిక చర్యలకు పాల్పడుతున్న సభ్యులు
- ఇదేమిటని ప్రశ్నిస్తే వేధింపులు, కుల బహిష్కరణలు
- ఆందోళనలో జిల్లావాసులు



వీడీసీ సభ్యులతో సమావేశమైన అధికారులు(ఫైల్)

మెట్‌పల్లి(కోరుట్ల): జిల్లాలోని కొన్ని గ్రామాభివృద్ధి(వీడీసీ) కమిటీల ఆగడాలు హద్దు మీరుతున్నాయి. ప్రధానంగా మెట్‌పల్లి డివిజన్‌లో పట్టపగ్గాల్లేకుండా తయారయ్యాయి. అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడమే కాకుండా ఇదేమిటని ప్రశ్నిస్తే అనాగరిక చర్యలకు దిగుతున్నాయి. పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా ఖాతరు చేయడం లేదు. చాలా వీడీసీలు తమ గ్రామాల అభివృద్ధిలో కీలకంగా వ్యవహరిస్తే.. మెట్‌పల్లి డివిజన్‌లోని పల్లెల్లో కొన్ని వీడీసీలు అందుకు భిన్నంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడం వివాదాస్పదమవుతోంది.

అభివృద్ధి లక్ష్యంగా..

మెట్‌పల్లి డివిజన్‌లోని ప్రతీ ఊరులో గ్రామాభివృద్ధి కమిటీ ఉంది. అన్ని సామాజిక వర్గాల్లోంచి ఒక్కొక్కరు ఈ కమిటీల్లో సభ్యులుగా ఉన్నారు. వీడీసీల ఆధ్వర్యంలోనే గ్రామాల్లో ఏటా జాతరలు, పండుగలు జరుపుతారు. ఇందుకు అవసరమైన నిధులు సమకూర్చుకునేందుకు కొన్ని వీడీసీలు చట్ట వ్యతిరేక పనులకు పాల్పడుతున్నాయి. కూల్‌డ్రింక్స్, చికెన్, మటన్ విక్రయాలు, ఇసుక రవాణా, బెల్ట్ దుకాణాల నిర్వహణకు ఇవే వేలం వేస్తున్నాయి. అత్యధికంగా పాట పాడిన వారికే అనుమతి ఇస్తున్నాయి.

- కోరుట్ల మండలం మెట్లచిట్టాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ(వీడీసీ) సభ్యులు ఇటీవల ధాన్యం కొనుగోళ్లలో తీసుకున్న నిర్ణయాన్ని మున్నూరు, గుడేటికాపులు వ్యతిరేకించారు. ఆగ్రహించిన వీడీసీ.. సుమారు 70కుటుంబాలపై సాంఘిక బహిష్కరణ విధించింది. అన్నివర్గాలు సహాయ నిరాకరణ పాటించాయి. బాధితులు చివరకు పోలీసులను ఆశ్రయించగా ఆంక్షలు ఎత్తివేయాలని హెచ్చరిస్తూనే 8మందిపై కేసు నమోదు చేశారు. అయినా, బాధితులపై ఆంక్షలు నేటికీ తొలగించడంలేదు.



వీడీసీపై ఫిర్యాదు చేస్తున్న మెట్లచిట్టాపూర్ గ్రామస్తులు (ఫైల్)

పోలీసుల ఆదేశాలు ధిక్కరిస్తూ..

- చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వీడీసీలపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా సభ్యులు ఖాతరు చేయడంలేదనే విమర్శలు ఉన్నాయి. కొందరు వీడీసీలు తమ చర్యల్ని సమర్థించుకునేందుకు గతంలో పోలీస్‌స్టేషన్లనూ ముట్టడించిన సంఘటనలు ఉండడం వాటి ఆగడాలకు అద్దం పడుతోంది. శాంతిభద్రతలకు సవాల్‌గా నిలుస్తున్న వీడీసీ సభ్యులను రెవెన్యూ అధికారుల ఎదుట తరచూ బైండోవర్ చేయడం, ఫిర్యాదులు వస్తే కేసులు నమోదు చేయడం పరిపాటిగా మారింది. గడిచిన రెండేళ్లలో సుమారు 500 మంది సభ్యులకు పైగానే బైండోవర్ చేశారు. ఇటీవల ఒక్క మెట్‌పల్లి మండలంలోనే ఐదు వీడీసీలపై కేసులు నమోదు చేశారు. వీడీసీలు నిర్వహించే వేలం పాటలతోపాటు ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలను పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఇటీవల సర్కిల్ పరిధిలోని పలు గ్రామాల్లో ఇసుకకు వీడీసీలు వేలం నిర్వహించాయి. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కలెక్టర్ ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. ఆ తర్వాతనే ఇసుక వేలం పాటలు నిర్వహించడం గమనార్హం. వీడీసీల నుంచి మామూళ్లు ముడుతుండడంతోనే పోలీసులు వేలం పాటలను అడ్డుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

వ్యతిరేకిస్తే అంతే..

- వీడీసీ సభ్యులు తీసుకునే నిర్ణయాన్నే గ్రామస్తులు అందరూ అంగీకరించాలి.
- స్థానిక ప్రజాప్రతినిధులు కూడా 'జీ హుజూర్' అనాల్సిందే.
- వ్యతిరేకించేవారిపై కన్నెర్ర చేయడం, ఇబ్బందులకు గురిచేయడం వీడీసీలకు అలవాటుగా మారింది.
- ముఖ్యంగా సామాజిక బహిష్కరణ విధిస్తూ నానాయాగీ చేస్తున్నాయి.
- బహిష్కరణకు గురైనవారికి కిరాణా సామగ్రి ఇవ్వడంలేదు. ఎవరూ సహకరించడంలేదు
- పాలు పోయడం లేదు. క్షవరం చేయడంలేదు. బట్టలు ఉతకడం లేదు. కూలీకి రావడంలేదు.
- తమ ఇళ్లలో జరిగే శుభ, అశుభ కార్యాలకు కూడా వెళ్లడంలేదు.
- వెల్లుల్లలో వీడీసీ విధించిన నిబంధనలను ఉల్లంఘించిన ముగ్గురు గీత కార్మికుల కల్లు కొనుగోళ్లపై ఇటీవల ఆంక్షలు విధించగా, బాధితులు పోలీసులను ఆశ్రయించారు.
- దీంతో 23మంది సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు.
- కొండ్రికర్లలో ఓ భూమి విషయంలో వీడీసీ సభ్యులు, ముదిరాజ్‌ల మధ్య వివాదం నెలకొంది.
- దీనిని దృష్టిలో పెట్టుకొని ముదిరాజ్‌లపై వీడీసీ సభ్యులు సామాజిక బహిష్కరణ విధించారు.
- ఈ వ్యవహారంలోనూ వీడీసీ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బాధితుల ప్రత్యేక దుకాణం

వీడీసీ విధించిన సాంఘిక బహిష్కరణ నేపథ్యంలో మెట్లచిట్టాపూర్‌లో రెండు సామాజిక వర్గాలు తమ అవసరాల కోసం ప్రత్యేకంగా ఓ వ్యక్తితో కిరాణం ఏర్పాటు చేయించాయి. దీంతో వారి నిత్యావసరాల సమస్య కొంత వరకు పరిష్కారమైంది.

పోలీసులు జోక్యం చేసుకున్నా..

వీడీసీ సభ్యులు సామాజిక బహిష్కరణ విధించడంతో అనేక విధాలుగా అవస్థలు పడుతున్నాం. పోలీసులకు ఫిర్యాదు చేస్తే సభ్యులపై కేసు నమోదు చేశారు. ఆంక్షలు తొలగించాలని సూచించారు. కానీ ఇంకా ఆంక్షలు తొలగించలేదు. తదుపరి చర్యల కోసం ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు.
– మెట్లచిట్టాపూర్ బాధితులు

కఠిన చర్యలు తీసుకుంటాం

కొన్ని గ్రామాల్లో వీడీసీలు సామాజిక బహిష్కరణ చేస్తున్నాయని మాకు ఫిర్యాదులు వస్తున్నాయి. ఇలాంటివారిని గుర్తించి ఇప్పటికే మందలించాం. ఇకముందు అలాంటి పనులు చేయబోమని వీడీసీలు హామీ ఇచ్చాయి. చట్టవ్యతిరేక పనులకు పాల్పడే గ్రామాభివృద్ధి కమిటీలపై కఠిన చర్యలు తీసుకుంటాం.
– సత్యనారాయణ, తహసీల్దార్, మెట్‌పల్లి

కేసులు నమోదు చేస్తున్నాం

చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న వీడీసీలపై ఫిర్యాదులు వస్తే కేసులు నమోదు చేస్తున్నాం. ఇటీవల మెట్లచిట్టాపూర్ వీడీసీ సభ్యులపై కేసులు నమోదు చేశాం. గ్రామాభివృద్ధిలో పాలుపంచుకోవాలే తప్ప చట్టాన్ని ఎవరూ తమ చేతుల్లోకి తీసుకోరాదు. ఇలా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు.
– లక్ష్మీనారాయణ, సీఐ, మెట్‌పల్లి

న్యూస్‌రీల్

సమస్యలకు సత్వరమే పరిష్కారం

జగిత్యాల: ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి ద్వారా వినతులు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తూ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈసందర్భంగా 19 ఫిర్యాదులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బీఎస్ లత, మకరంద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి ఫలాలు అందుతున్నాయా?



గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

సారంగాపూర్(జగిత్యాల): 'రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు మీకు అందుతున్నాయా?' అని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. మీకు.. నేను కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఎమ్మెల్యే మంగేళ గ్రామంలో పర్యటించారు. కార్యకర్తలు, గ్రామస్తులతో సమావేశమయ్యారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందుతున్న కుటుంబాలను ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ప్రభుత్వం నుంచి ఇంకా ఏం ఆశిస్తున్నారని పలకరించారు. అనంతరం పల్లెనిద్ర చేశారు. మంగళవారం మంగేళ, కమ్మునూర్ గ్రామాల్లో పర్యటిస్తారు. కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, సర్పంచ్ చంచు శారద, టీఆర్ మండల అధ్యక్షుడు నారపాక రమేశ్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సాగునీటిపై పర్యవేక్షణ అవసరం

సారంగాపూర్(జగిత్యాల): ప్రస్తుతం ఎండలు ముదురుతున్నాయని, ఈనేపథ్యంలో ఎస్సారెస్పీ సాగునీటి సరఫరాపై నీటిపారుదల శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. తాటిచెట్టుపైనుంచి పడి గాయాలకుగురూ కోలుకుంటున్న రంగపేట గ్రా మానికి చెందిన గీత కార్మికుడు నాయిని రాజన్నను ఎమ్మెల్సీ సోమవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. మంచానికే పరిమితమైన రాజన్న కుటుంబాన్ని ఆదుకోవాలని ఫోన్ ద్వారా అధికారులను కోరారు. అనంతరం డి-53, 12 ఎల్,1ఆర్ కాలువ కింద బట్టపల్లి, పోతారం, సారంగాపూర్ పరిధిలోని ఆయకట్టుకు ఎస్సారెస్పీ సాగునీరు అందడంలేదని, ఫలితంగా ఈ యాసంగిలో వేసిన వరి పంట ఎండిపోతోందని రైతులు కొక్కు గంగారాం, ఏలూరి రాజిరెడ్డి, కాలగిరి మధు తదితరులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్సీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు బేతి శంకర్ రెడ్డి, ఆకుల రాజిరెడ్డి, మాలెపు సుధాకర్, రామడుగు రవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో కోరుట్లకు 43 పతకాలు



పతకాలు సాధించిన సభ్యులు

కోరుట్ల: వేములవాడలో ఆదివారం ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ, ఒకినావా స్కూల్ ఆఫ్ కరాటే ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో కోరుట్లకు చెందిన ఒకినావా స్కూల్ ఆఫ్ కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు కోచ్ అండ్ ఫౌండర్ అల్లె రమేశ్ సోమవారం తెలిపారు. కటాస్, కుమితే సీనియర్, జూనియర్ విభాగంలో 26 మంది విద్యార్థులు పాల్గొని 16 గోల్డ్, 6 సిల్వర్, 21 బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు రమేశ్ పేర్కొన్నారు. ప్రతిభ చూపిన పలువురు క్రీడాకారులకు టోర్నీ ఆర్గనైజర్, తెలంగాణ చీఫ్ కె.వసంత్‌కుమార్, టోర్నీ చీఫ్‌ఆర్గనైజర్ మన్సూన్ తదితరులు పతకాలు అందించారు.

తైక్వాండో పోటీల్లో..

చొప్పదండిలో నిర్వహించిన డిస్ట్రిక్ట్ తైక్వాండో చాంపియన్‌షిప్ -2023 పోటీల్లో కోరుట్లకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. ఈపోటీల్లో 19 మంది పాల్గొనగా 10 గోల్డ్ మెడల్స్, 8 సిల్వర్ మెడల్స్, 7 బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు తైక్వాండో క్లబ్ ఫౌండర్, కోచ్ నేతాజీ తెలిపారు. మార్కెట్‌కమిటీ చైర్మన్ ఆర్.చంద్రశేఖర్ పతకాలు అందించారు. తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జి.సంతోష్ కుమార్, కరీంనగర్ జిల్లా జనరల్ సెక్రటరీ సంతోష్‌కుమార్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గంగారావు తదితరులు అభినందించారు.

టెండర్లు వేయం.. వేయనియ్యం..!

- రోడ్ల మరమ్మతుల్లో కొన్నిచోట్ల కాంట్రాక్టర్ల చేతివాటం
- అధిక ధరలకు టెండర్లు దక్కించుకునేందుకు వ్యూహం
- 210 టెండర్లలో ఒక్కటీ ఆమోదం పొందని వైనం
- పంచాయతీరాజ్ శాఖలో కొందరు అధికారుల సహకారం..?
- ఉమ్మడి జిల్లాలో 506 కి.మీ రోడ్లకు రూ.192 కోట్ల అంచనాతో పనులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రోడ్ల మరమ్మతుల్లో కొందరు కాంట్రాక్టర్లు చక్రం తిప్పడానికి సిద్ధమయ్యారని సమాచారం. ఇటీవల వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయి. ఈక్రమంలో ప్రభుత్వం వీటి మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగానే కొత్త జిల్లాల వారీగా ధ్వంసమైన రోడ్లకు అంచనాలు రూపొందించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే.. ఆయా పనులకు టెండర్లు పిలిచారు. చాలా ప్రాంతాల నుంచి కాంట్రాక్టర్ల నుంచి స్పందన బాగానే ఉంది. కొన్ని ప్రాంతాల్లో మాత్రం పనులు చేసేందుకు అధికారులు టెండర్లు పిలిచినా.. కాంట్రాక్టర్ల నుంచి స్పందన కరువవడం గమనార్హం. మరమ్మతు పనుల్లో అధిక లాభాలు గడించేందుకు టెండర్లు వేయం.. వేయనీయం అన్నట్లుగా కాంట్రాక్టర్లు వ్యవహరిస్తుండడం గమనార్హం.

రింగైన కాంట్రాక్టర్లు..?

రాష్ట్రవ్యాప్తంగా వరదలు, వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు సంబంధించిన దుస్థితిపై 'సాక్షి' ప్రధాన పత్రికలో 'రోడ్లకు రోగం' పేరిట సమగ్ర కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే సమీక్ష జరిపారు. రోడ్ల మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని ఆ సమావేశంలో ఆదేశించారు. అందులో భాగంగా కరీంనగర్ రీజియన్‌లో ఉన్న కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలకు సంబంధించి దాదాపు రూ.192.44 కోట్ల అంచనాలతో మొత్తంగా 506.39 కి.మీల మేర ధ్వంసమైన రోడ్లకు అధికారులు టెండర్లు పిలిచారు. ఇందులో ఉమ్మడి జిల్లా మొత్తం కలిపి ఫిబ్రవరి చివరినాటికి 210 టెండర్లు వచ్చాయి. అందులో నుంచి 168 టెండర్లను చీఫ్ ఇంజినీర్‌కు సమర్పించారు.



జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం బట్టపల్లి, పోతారం గ్రామాల మధ్య శిథిలమైన రహదారి

రీజియన్	మొత్తం	బీటీఆర్	ఎఫ్‌డీఆర్	బీటీ కి.మీ	అంచనా వ్యయం రూ.కోట్లల్లో	టెండర్ రిసీవ్డ్	టెండర్ సబ్మిటెడ్
కరీంనగర్	80	24	56	209.23	96.62	77	51
జగిత్యాల	94	28	66	173.81	58.59	94	83
పెద్దపల్లి	15	15	00	36.35	11.59	15	15
రాజన్నసిరిసిల్ల	27	19	08	87.00	25.64	24	19
మొత్తం	216	86	130	506.39	192.44	210	168

(బీటీఆర్ = బ్లాక్ తార్ రోడ్డు, ఎఫ్‌డీఆర్= ఫ్లడ్ డ్యామేజ్ రోడ్డు)
నోట్: ఫిబ్రవరి చివరి నాటికి మరమ్మతుకు సంబంధించి టెండర్ల పురోగతి

ఒక్క టెండరూ ఆమోదం పొందలేదా?

కరీంనగర్ రీజియన్ పరిధిలో మొత్తం వచ్చిన టెండర్లలో 210లో కేవలం 168 టెండర్లు మాత్రం చీఫ్ ఇంజినీర్‌కు వెళ్లాయి. ఇప్పటివరకూ వీటిలో ఒక్క పని కూడా ఆమోదం పొందలేదు. మరోవైపు 2022-23 ఆర్థిక సంవత్సరం ఈనెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఒక్కపని కూడా ఆమోదం పొందకపోవడంలో ఆంతర్యం ఏంటన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పనుల ఆమోదంలో జాప్యం వల్ల.. అధిక అంచనాలకు టెండర్లు దాఖలు చేసే కాంట్రాక్టర్లకే లబ్ధి చేకూరుస్తుందని తెలిసినా టెండర్లలో పురోగతి లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంలో అధికారుల తీరుపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

- మరికొన్ని చోట్ల రెండుసార్లు టెండర్లు పిలిచినా ఇంతవరకూ కాంట్రాక్టర్ల నుంచి స్పందన కరువైంది. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్లంతా ముందే రింగయ్యారని, అందుకే కొన్నిచోట్ల టెండర్లు వేసినా ఎలాంటి స్పందన రావడం లేదని పంచాయతీరాజ్ సిబ్బందే వ్యాఖ్యానిస్తున్నారు. మూడోసారి టెండరు పిలిచినప్పుడు ఉన్న ధర కంటే అధికంగా కోట్ చేసినా గత్యంతరం లేక ఆమోదింపజేసుకునేందుకు కాంట్రాక్టర్లు వేసిన ఎత్తుగడగా అభివర్ణిస్తున్నారు. ఇందుకు పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది కూడా సహకరిస్తున్నారని ప్రచారం సాగుతోంది.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

- కలెక్టర్ యాస్మిన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: జిల్లాలో ఈనెల 15 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు నిర్వహించే ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలకు అన్నిఏర్పాట్లు పూర్తిచేశామని కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. విద్యార్థుల కోసం జిల్లా వ్యాప్తంగా 29 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఫర్నిచర్, స్వచ్ఛమైన తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించామన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ అన్నారు. వైద్య శిబిరాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ముఖ్యకార్యదర్శి శాంతికుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఉదయం 8.30 గంటల నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని కలెక్టర్ అన్నారు. ఒక నిమిషం ఆలస్యం నిబంధనను కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. దూర ప్రాంతాల విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులు నడపుతోందని కలెక్టర్ వివరించారు.

అందుబాటులో టోల్‌ఫ్రీ నంబరు 14416

పరీక్షల భయం పోగొట్టేందుకు టోల్‌ఫ్రీ నంబరు 14416లో మానసిక వైద్యులు 24గంటల పాటు అందుబాటులో ఉంటారని, సమస్యలు ఉన్నవారు ఈ నంబరును సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ఇంటర్నెట్ నుంచి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు. ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని అన్నారు. ఫీజు చెల్లించలేదనే కారణంతో హాల్‌టికెట్లు ఇవ్వని ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందుకోసం కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామని అన్నారు. జిల్లాస్థాయిలో 18004257620, రాష్ట్రస్థాయిలో 040-24601010, 24655027 నంబర్లు ఉన్నాయని తెలిపారు. పరీక్షల నిర్వహణ కమిటీ నోడల్ అధికారి నారాయణ పాల్గొన్నారు.



పుష్పయాగం.. ఏకాంతోత్సవం

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి పుష్పయాగం, ఏకాంతోత్సవం వైభవంగా జరిపించారు. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీవేంటేశ్వర స్వామి ఆలయంలోని స్వామివారికి తొలుత ప్రత్యేకపూజలు చేశారు. వివిధ రకాల పూలు, చెట్లఆకులతో పుష్పయాగం జరిపారు. ఏకాంతోత్సవం సందర్భంగా ప్రధాన ఆలయంలో ఐదు ప్రదక్షిణలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, వేదపండితుడు బొజ్జ రమేశ్‌శర్మ, ఉప ప్రధాన అర్చకుడు నేరెళ్ల శ్రీనివాసచారి, రెనోవేషన్ కమిటీ చైర్మన్ రామన్న పాల్గొన్నారు.



మన ఊరు.. మన బడితో మహర్దశ

- రాష్ట్రసంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్

వెల్గటూర్(ధర్మపురి): మన ఊరు.. మన బడి ద్వారా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధిలో పయనిస్తున్నాయని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. సోమవారం ఆయన వెల్గటూర్, ఎండపల్లి మండలాల్లో పర్యటించారు. మన ఊరు.. మనబడిలో అభివృద్ధి చెందిన పాఠశాలలను అడిషనల్ కలెక్టర్ లతతో కలిసి ప్రారంభించారు. కొత్తపేట-పడకల్, కొత్తపేటలో సీసీ రోడ్లు, గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపనలు చేశాక జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. తొలివిడత మన ఊరు.. మన బడి కార్యక్రమంలో ధర్మపురి నియోజకవర్గంలో 91 పాఠశాలలు ఎంపికయ్యాయని తెలిపారు. వచ్చే మూడేళ్లలో వందశాతం ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయిలో రూపొందుతాయని అన్నారు. అనంతరం వెల్గటూర్ మండలం స్తంభంపల్లి బీసీ గురుకుల పాఠశాల వార్షిక వేడుకల్లో పాల్గొన్నారు. అదనపు తరగతి గదులు ప్రారంభించారు. అదనపు కలెక్టర్ లత మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. డీఈవో జగన్మోహన్, సర్పంచులు కొమ్ము రాంబాబు, మెతుకు స్వరూప, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

క్లుప్తంగా

ఢిల్లీకి తరలివెళ్లిన వైఎస్సార్‌ టీపీ నాయకులు



ఢిల్లీకి తరలివెళ్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

జగిత్యాల రూరల్‌: ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్‌ షర్మిల చేపట్టే ధర్నాకు జిల్లా వైఎస్సార్‌టీపీ నాయకులు సోమవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చెదల సత్యనారాయణ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందన్నారు. దీనిని నిరసిస్తూ మంగళవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్‌ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్‌, రాజమ్మ, ప్రేమ్‌సాగర్‌, స్రవంతి పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం

జగిత్యాల: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జెడ్పీచైర్‌పర్సన్‌ దావ వసంత సూచించారు. ఎమ్మెల్సీ కవిత జన్మదినం సందర్భంగా స్థానిక మాతాశిశు సంక్షేమ కేంద్రంలో సోమవారం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వైద్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ, పేషెంట్లకు ఎలాంటి ఇబ్బందులు కలగనివ్వొద్దన్నారు. మందులు సక్రమంగా ఇవ్వాలని, నార్మల్‌ డెలివరీలు అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పీఏసీఎస్‌ చైర్మన్లు మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు, బాలముకుందం, సూపరింటెండెంట్‌ రాములు, శశికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి



ఏవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న గ్రామ పంచాయతీ ఉద్యోగులు

జగిత్యాల: చాలీచాలని వేతనంతో ఇబ్బందులకు గురై కామారెడ్డి జిల్లాలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉరేసుకొని మృతిచెందిన కొంగరి బాబు కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, గతంలో సీఎం ప్రకటించిన రూ.2 లక్షల ఇన్సూరెన్స్‌ను అమలు చేయాలన్నారు. యాక్ట్‌ 2/94ను రద్దుచేయాలని, సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఏవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పులిమల్లేశం, కోమటి చంద్రశేఖర్‌, ఎల్లయ్య, రాజేశం, టింకు, రాజేందర్‌, నర్సవ్వ, తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌ డీలర్‌పై కేసు



తనిఖీలు చేస్తున్న అధికారులు

జగిత్యాల క్రైం: జిల్లాలోని మెట్‌పల్లి పౌరసరఫరాల శాఖ ఇన్‌స్పెక్టర్‌, పౌరసరఫరాల శాఖ ఆర్‌ఐ ఆధ్వర్యంలో బీమారం మండలం రంగాపూర్‌లో రేషన్‌ దుకాణంలో తనిఖీలు చేపట్టారు. వొద్దినేని మాలతి రేషన్‌ షాపులో తనిఖీలు చేపట్టగా బియ్యం నిల్వల్లో వ్యత్యాసం రావడంతో రేషన్‌ దుకాణాన్ని సీజ్‌ చేసినట్లు తెలిపారు. డీలర్‌పై కేసు నమోదు చేశామన్నారు. దుకాణంలోని నిల్వలను భద్రత నిమిత్తం బీమారంలోని రేషన్‌ డీలర్‌ గరిపల్లి రవీందర్‌కు అప్పగించినట్లు చెప్పారు.

నేరాల నియంత్రణకు చర్యలు

- జిల్లాలో గతేడాది 5812 కేసులు నమోదు
- మూడు నెలల్లో 364 కేసులు



కేసు నమోదు చేస్తున్న ట్రాఫిక్‌ పోలీసులు

జగిత్యాల క్రైం: జిల్లాలో చిన్న నేరాల నియంత్రణకు పోలీసులు ఈపెటీట్‌ కేసులు నమోదు చేస్తున్నారు. ఈపెట్టీ యాప్‌ ద్వారా నేరం జరిగిన సమయంలో సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని ట్యాబ్‌లు, ఐప్యాడ్‌ల ద్వారా కేసులు నమోదు చేస్తారు. జిల్లావ్యాప్తంగా 2021లో 10,210 ఈపెట్టీ కేసులు నమోదు కాగా 2022లో 5812 నమోదు చేశారు. జిల్లావ్యాప్తంగా జనవరి నుంచి ఇప్పటి వరకు 364 కేసులు నమోదయ్యాయి. ఆధారాలతో సహా కేసులు నమోదు చేస్తుండటంతో నేరం చేసిన వారు తప్పించుకోలేకపోతున్నారు. జిల్లావ్యాప్తంగా పోలీసుశాఖ ఈపెట్టీ కేసులు నమోదు సత్ఫలితాలిస్తున్నాయి. రహదారి, ఫుట్‌పాత్‌ అక్రమాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, చిన్న చిన్న కేసులను పోలీసులు ఈపెట్టీ యాప్‌ద్వారా నమోదు చేస్తారు.

సత్వరమే కేసుల నమోదు..

ఎక్కడైనా గొడవలు జరుగుతున్నాయని పోలీసులకు సమాచారం అందితే నేరుగా అక్కడకి వెళ్లి సరైన ఆధారాలు సేకరించి అక్కడికక్కడే కేసులు నమోదు చేస్తారు. పట్టణాల్లో ఫుట్‌పాత్‌ అక్రమాల ద్వారానే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు గుర్తించారు. అక్రమాలను తొలగించి ట్యాబ్‌ల ద్వారా అక్కడికక్కడే ఫొటోలు, వీడియోలు తీసి ఆధారాలతో క్షణాల్లో ఈ పెట్టీ కేసుల యాప్‌లో నమోదు చేస్తున్నారు. 2–3 నిమిషాల్లో ట్యాబ్‌ల ద్వారా ఫొటోలు, వీడియోలు తీసి కేసు నమోదు చేసే విధానం గురించి పోలీసులకు గతంలోనే శిక్షణనిచ్చారు. గొడవలు, అక్రమాలు వంటివి జరిగితే పోలీసులు, సంబంధిత అధికారులు సంఘటన స్థలానికి చేరుకుంటారు. నిందితుల వివరాలతో పాటు కేసునమోదు చేసిన వెంటనే కోర్టుకు హాజరయ్యే తేదీని తెలియజేస్తారు. ఇలా పోలీస్‌స్టేషన్ల వారీగా కేసులను రికార్డుల్లో నిక్షిప్తంగా ఉంచుతారు. నేరస్తులు ఈపెట్టీ కేసుల ద్వారా మరోసారి నేరానికి పాల్పడే అవకాశం ఉండదు. రాష్ట్ర పోలీసు శాఖ ఈపెట్టీ కేసు యాప్‌ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలల్లోకి తీసుకురావడంతో సత్ఫలితాలిస్తున్నాయి. జిల్లాలో ఈపెట్టీ కేసుల నమోదుతో నేరస్తుల్లోఆందోళన మొదలైంది.

జిల్లావ్యాప్తంగా ఈపెటట్టీ కేసుల వివరాలు..

2021లో	:10,210 కేసులు
2022	:5812 కేసులు
2023లో (ఇప్పటి వరకు)	: 364 కేసులు

చిన్న నేరాలపై ఈపెట్టీ కేసు



జిల్లాలో ఎలాంటి చిన్న గొడవలు జరిగినా వారిపై అక్కడే ఆధారాలు సేకరించి నిందితులు, నేరస్తులపై ఈపెట్టీ కేసుల్లో నమోదు చేస్తున్నాం. వారి పూర్తి వివరాలను యాప్‌లో పొందుపర్చుతున్నాం. దీంతో నేరస్తులు మళ్లీ ఏదైనా నేరం చేసినా సులువుగా తెలిసిపోతుంది. – భాస్కర్‌, ఎస్పీ

వరకట్న వేధింపులకు వివాహిత బలి

- ఈ నెల 12న ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి



సరిత (ఫైల్‌)

ధర్మారం(ధర్మపురి): మండలంలోని కొత్తపల్లికి చెందిన అజ్మీరా సరిత(29) అత్తింటి వేధింపులు భరించలేక ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్సై శ్రీనివాస్‌ తెలిపిన వివరాల ప్రకారం.. సరితకు కొత్తపల్లికే చెందిన అజ్మీరా స్వామినాయక్‌తో పదేళ్ల క్రితం పెళ్లి జరిగింది. వివాహ సమయంలో ఒప్పుకున్న కట్నకానుకలు ముట్టజెప్పారు. ఈ దంపతులకు కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కానీ అత్తంటివారు అదనపు వరకట్నం కోసం తరచూ వేధిస్తుండటంతో సరిత మనోవేదనకు గురైంది. ఈ క్రమంలో ఆదివారం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్‌ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతిచెందింది. భర్త స్వామినాయక్‌తోపాటు అత్తామామ అజ్మీరా గంగమ్మ, జగ్‌మాల్‌నాయక్‌, ధర్మారం మండలంలోని బంజేరుపల్లి తండాకు చెందిన ఆడపడచులు భూక్య రాజమ్మ, భూక్య శ్రీలత, భూక్య కవితలు వేధింపులకు గురిచేయడం వల్లే సరిత ఆత్మహత్య చేసుకుందని మృతురాలి సోదరి బదావత్‌ మహేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడి ఘటనపై కేసు నమోదు

తిమ్మాపూర్‌(మానకొండూర్‌): అలుగునూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌ వద్ద హిజ్రాల హల్‌చల్‌ దాడికి కారణమైంది. వివరాల్లోకి వెళ్తే.. అలు గునూర్‌లోని హైదరాబాద్‌ రాజీవ్‌ రహదారికి అనుకొని ఉన్న ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం సాయంత్రం రిసెప్షన్‌ జరుగుతోంది. హిజ్రాలు అక్కడికి చేరుకున్నారు. ఫంక్షన్‌హాల్‌ ని ర్వాహకులు వారిని లోపలికి వెళ్లకుండా ఆపేయడంతో ఇరువర్గాల మధ్య గొడవ మొదలైంది. హిజ్రాలు భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్‌ చేయడంతో నిర్వాహకులు ఆగ్రహానికి గురయ్యారు. తోపులాట జరిగి, దాడులు చేసుకున్నారు. పోలీసులు సంఘటన స్థ లానికి చేరుకున్నారు. సోమవారం హిజ్రాల ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రమోద్‌ రెడ్డి తెలిపారు. కాగా ప్రతీ సారి ఫంక్షన్‌హాల్‌కు వచ్చి, హిజ్రాలు ఇష్టారీతిలో వ్యవహరిస్తున్నందునే తాము ఆగ్రహం వ్యక్తం చేశామని నిర్వాహకులు తెలి పారు. గతంలో పోలీసులు సైతం పలుమా ర్లు హెచ్చరించారని పేర్కొన్నారు. ఈ విషయమై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

లైంగికదాడికి యత్నించిన కేసులో ఒకరికి జైలు

కరీంనగర్‌ క్రైం: బాలికపై లైంగిక దాడికి యత్నించిన కేసులో నేరస్తుడు వరికోలు లింగమూర్తి అలియాస్‌ లింగయ్యకు పదేళ్ల జైలుశిక్ష, రూ.4 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్‌ మొదటి అదనపు జిల్లా జడ్జి, పోక్సో కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి శ్రీవాణి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్‌ కథనం ప్రకారం.. కరీంనగర్‌లోని కోతిరాంపూర్‌లో ఉండే దంపతులకు పాప, బాబు సంతానం. భార్య కూలీ పనులకు వెళ్తుండగా, భర్త రిక్షా నడుపుకుంటూ పిల్లలను పోషించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో 2019 ఫిబ్రవరి 1న ఉదయం 10 గంటలకు దంపతులిద్దరూ ఆసుపత్రికి వెళ్లారు. ఆరోజు విద్యాసంస్థలు బంద్‌ ఉండటంతో పాప, బాబు ఇంట్లోనే ఉన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు బాబు ఆడుకునేందుకు బయటకు వెళ్లగా పాప ఒక్కతే ఇంట్లో ఉంది. ఇది గమనించిన అదే ప్రాంతానికి చెందిన వరికోలు లింగమూర్తి అలియాస్‌ లింగయ్య ఇంట్లోకి ప్రవేశించి, తలుపులు గడియ వేసి, అమ్మాయిపై లైంగిక దాడికి యత్నించాడు. అదే సమయంలో ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చిన భార్యాభర్తలకు తలుపులు గడియ పెట్టి ఉండటంతో అనుమానం వచ్చింది. బలవంతంగా తలుపులు తెరిచారు. లోపల లింగయ్యను చూసి కేకలు వేయడంతో అతను పరారయ్యాడు. ఈ సంఘటనపై బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి కరీంనగర్‌ వన్‌ టౌన్‌ సీఐ తుల శ్రీనివాసరావు కేసు నమోదు చేయగా ఏసీపీ అశోక్‌ దర్యాప్తు జరిపారు. సాక్షులను సీఎంఎస్‌ పీసీ కిశోర్‌ కుమార్‌ కోర్టులో ప్రవేశపెట్టగా అడిషనల్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ కనుకుల సంజీవరెడ్డి విచారించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి శ్రీవాణి నిందితుడికి సోమవారం శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు.

రేపు ‘బలగం’ సక్సెస్‌ మీట్‌

విద్యానగర్‌(కరీంనగర్‌): హర్షిత్‌ రెడ్డి, హన్షిత దిల్‌ రాజు ప్రొడక్షన్స్‌ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత దిల్‌రాజు ప్రియదర్శి, కావ్య, కల్యాణిరామ్‌, సుధాకర్‌రెడ్డి, మురళీధర్‌ గౌడ్‌ ప్రధాన పాత్రధారులుగా వేణు ఎల్దండి దర్శకత్వంలో నిర్మించిన బలగం సినిమా భారీ విజయం సాధించింది. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం కరీంనగర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే గ్రౌండ్‌లో సక్సెస్‌ మీట్‌ నిర్వహిస్తున్నట్లు ఆ చిత్ర యూనిట్‌ తెలిపింది. దీనికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్‌, చిత్ర దర్శకుడు వేణు, నటీనటులు, సాంకేతిక సిబ్బంది హాజరవుతారని పేర్కొంది.

ఆస్కార్‌ పురస్కారం రావడంపై హర్షం



గుండేటి రాజు

జగిత్యాల: ఆర్‌ఆర్‌ఆర్‌ చిత్రంలోని నాటునాటు పాటకు ఆస్కార్‌ పురస్కారం రావడం తెలుగు సినిమా విజయమని కళాశ్రీ అధినేత గుండేటి రాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచస్థాయిలో నేడు తెలుగు సినిమాకు లభించిన అరుదైన గౌరవమన్నారు. పాట రచయిత చంద్రబోస్‌, దర్శకుడు కీరవాణి, గాయకుడు రాహుల్‌ సిప్లిగంజ్‌కు అభినందనలు తెలిపారు. ఈ అవార్డు రావడంపట్ల పలువురు వక్తలు హర్షం వ్యక్తం తెలిపారు.

ఈనెల 20, 21 తేదీల్లో ట్యూటర్‌ పోస్టులకు ఇంటర్వ్యూలు

జగిత్యాల : స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో 12 ట్యూటర్‌ పోస్టుల భర్తీకి ఈనెల 20, 21 తేదీల్లో వాక్‌ ఇన్‌ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు కలెక్టర్‌ యాస్మిన్‌ బాషా తెలిపారు. కాంట్రాక్ట్‌ పద్ధతిన ఎంపిక ఉంటుందన్నారు. 45 సంవత్సరాలలోపు ఉన్నవారు, పీహెచ్‌డీ వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు అన్ని ఒరిజినల్‌ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

చికిత్స పొందుతూ మృతి



రాము (ఫైల్‌)

పెగడపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన పూసాల కొమురయ్య – చిలుకమ్మ దంపతులకు ముగ్గురు కుమారులున్నారు. రెండో కుమారుడు రాము (27) రెండేళ్ల క్రితం దుబాయి వెళ్లాడు. అక్కడ ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. నెలరోజుల క్రితం అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొందినా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో అక్కడున్న స్నేహితులు కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి రామును 20 రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి సోమవారం ఉదయం మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

మెట్‌పల్లి: పట్టణంలోని ఆరపేటకు చెందిన పెద్దమ్మల పెంటయ్య (50) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్యామ్‌ రాజ్‌ తెలిపారు. పెంటయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. దీంతో మద్యానికి బానిసై సోమవారం ఇంట్లో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మోహన్‌రావుపేటలో..

కోరుట్ల రూరల్‌ : మండలంలోని మోహన్‌రావుపేటకు చెందిన తొగరి లక్ష్మణ్‌ (57)సోమవారం సాయంత్రం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మణ్‌ అప్పులబాధతో పాటు పాటు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య సరిత, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రామడుగు(చొప్పదండి): మండలంలోని షానగర్‌ మాజీ సర్పంచ్‌ గునుకొండ అశోక్‌కుమార్‌ సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడ్డారు. గ్రామస్తుల వివరాలు.. ట్రాక్టర్‌ వాటర్‌ ట్యాంక్‌లో నీటిని నింపుకొని వెదిర వైపు వెళ్తుండగా బోల్తాపడింది. ఈ ఘటనలో రోడ్డుపైన పడిపోయిన అశోక్‌కు తీవ్రగాయాలు కాగా కరీంనగర్‌లోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు.

గుండెపోటుతో 108 ఉద్యోగి మృతి

వీణవంక(హుజూరాబాద్‌): మండల కేంద్రానికి చెందిన రిజ్వాన్‌(35) అనే 108 ఉద్యోగి గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం. రిజ్వాన్‌ కొంతకాలంగా వీణవంకలో 108 వాహన డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం రాత్రి హఠాత్తుగా గుండెనొప్పి రావడంతో కుటుంబసభ్యులు జమ్మికుంటలోని ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ ఘటనతో మృతుడి కుటుంబసభ్యులు, గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి. ప్రభుత్వ విప్‌ పాడి కౌశిక్‌రెడ్డి, సర్పంచు నీల, ఉపసర్పంచ్‌ భానుచందర్‌ సంతాపం తెలిపారు.

గల్ఫ్‌ కార్మికులకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి

- అడ్లూరి లక్ష్మణ్‌ కుమార్‌

పెగడపల్లి: గల్ఫ్‌ కార్మికులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని జిల్లా కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన పూసాల రాము దుబాయిలో రోడ్డు ప్రమాదంలో గాయపడగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. సోమవారం సాయంత్రం జరిగిన రాము అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గల్ఫ్‌లో మృతి చెందిన బా ధిత కుటుంబాలకు కార్మికుల సంక్షేమం కోసం రూ.వెయ్యి కోట్లతో గల్ఫ్‌ సంక్షేమ బోర్డు ఏర్పాటు చే యాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బా ధిత కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇక్కడ మండల కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు రాములు గౌడ్‌, నా యకులు శంకర్‌, సత్తిరెడ్డి, బలరామ్‌ రెడ్డి, సత్తయ్య, సంజీవ్‌, తిరుపతి, అనిల్‌ గౌడ్‌, శ్రీను నాయక్‌, సామ్యానాయక్‌, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు



కేక్‌ కట్‌ చేసి స్వీట్లు తినిపించుకుంటున్న ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌

జగిత్యాల: తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిన ఘనత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితదని ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ అన్నారు. ఎమ్మెల్సీ కవిత జన్మదినోత్సవం సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కేక్‌ కట్‌ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీగా ఉన్న సమయంలోనే జగిత్యాల అభివృద్ధి చెందిందని, ఎమ్మెల్సీ కవితపై ఎన్ని ఆరోపణలు చేసినా ఏమీ చేయలేరన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్‌ దావ వసంత, గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ చంద్రశేఖర్‌ గౌడ్‌, మున్సిపల్‌ చైర్మన్లు గోలి శ్రీనివాస్‌, మోర హన్మాండ్లు, గట్టు సతీశ్‌, సర్పంచులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

- దేశరాజ్‌పల్లిలో ఘటన
- హత్య కోణంలో విచారణ జరుపుతున్న పోలీసులు



అనిత (ఫైల్‌)



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

రామడుగు(చొప్పదండి): దేశరాజ్‌పల్లిలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. దేశరాజ్‌పల్లికి చెందిన మామిడిపల్లి అనిత(45)కు భర్త లచ్చయ్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. లచ్చయ్య సెంట్రింగ్‌ పని కోసం కరీంనగర్‌ వెళ్లాడు. అక్కడి నుంచి భార్యకు సోమవారం పలుమార్లు ఫోన్‌ చేశాడు. స్పందన లేకపోవడంతో మధ్యాహ్నానికి ఇంటికి వచ్చాడు. ఇంటికి గొళ్లెం పెట్టి ఉండటంతో పక్కింటికి వెళ్లిందనుకొని చూశాడు. చాలా సమయం అవుతున్నా రాకపోవడంతో అనుమానం వచ్చి, గొళ్లెం తీసి చూడగా అనిత బెడ్‌పై చనిపో యి ఉంది. వెంటనే అతను రామడుగు పోలీసులకు సమాచారం అందించా డు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అనిత మృతి విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. దీంతో కరీంనగర్‌ రూరల్‌ ఏసీపీ కరుణాకర్‌రావు, చొప్పదండి సీఐ రవీందర్‌, రామడుగు ఎస్సై అంజయ్యలు చేరుకొని, మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సంఘటనపై ఏసీపీ కరుణాకర్‌రావు మాట్లాడుతూ.. అనిత హత్యకు గురైనట్లు భావిస్తున్నామని, ఆ కోణంలోనే విచారణ చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నివేదిక రాగానే పూర్తి విషయం తెలుస్తుందన్నారు. త్వరలో కేసు విచారణ పూర్తి చేసి, వివరాలను వెల్లడిస్తామన్నారు.

చేలల్లో విద్యుత్‌ తీగలు అమర్చితే జైలుకే

- సీఐ రమేశ్‌
- స్వామిరెడ్డి మృతికి కారణమైన నలుగురి అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న సీఐ రమేశ్‌

చిగురుమామిడి: పంట చేలకు విద్యుత్‌ తీగలు అమర్చి, ప్రాణనష్టం కలిగిస్తే ఎంతటివారినైనా జైలుకు పంపిస్తామని తిమ్మాపూర్‌ సీఐ పి.రమేశ్‌ హెచ్చరించారు. సోమవారం చిగురుమామిడి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై దాస సుధాకర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ఆదివారం పీచుపల్లి గ్రామానికి చెందిన గూడూరి స్వామిరెడ్డి పత్తి చేనులో అడవి పందుల కోసం విద్యుత్‌ తీగను అమర్చి, ఆయన మృతికి కారకులైన చిన్నముల్కనూర్‌కు చెందిన లోకిని రాములు, లోకిని సంపత్‌, తిమ్మాపూర్‌ మండలంలోని పర్లపల్లికి చెందిన భూనాద్రి ఐలయ్య, కెమ్మసారం సంపత్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారిని కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

అంజన్న సన్నిధిలో ఉద్యోగుల కొరత

- భక్తులకు తప్పని ఇబ్బంది



కొండగట్టు ఆలయం

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి సన్నిధిలో ఉద్యోగుల కొరత వేధిస్తోంది. మరో నెలరోజుల్లో ఆంజనేయస్వామి జయంతి తదితర ఉత్సవాలు ఉన్నాయి నిర్వహిస్తారు. కానీ, ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఏర్పాట్లు ఎలా చేసేదని అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

40 మందికి 12 మందే ఉన్నారు..

- ఆలయంలో ఒక ఏఈవో, నలుగురు సూపరింటెండెంట్లు, ఆరుగురు సీనియర్‌ అసిస్టెంట్లు, 12 మంది జూనియర్‌ అసిస్టెంట్లు, మిగతా వారు సిబ్బంది ఉండాలి.
- కానీ, ప్రస్తుం ముగ్గురు సీనియర్‌ అసిస్టెంట్లు, ఏడుగురు జూనియర్‌ అసిస్టెంట్లు, ఒక ఈవో, ఒక సూపరింటెండెంట్‌ మాత్రమే ఉన్నారు.

ఇష్టానుసారంగా విధులు..

ఉద్యోగులు, సిబ్బంది కొరతతో పర్యవేక్షణ కరువైంది. ఎవరిఇష్టానుసారంగా వారు విధులు నిర్వర్తిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అలాగే ఒక్కొక్కరు రెండు, మూడు విభాగాలు బాధ్యతలు చూసుకుంటున్నారు. అటెండర్లు. బుకింగ్‌ కౌంటర్‌, స్వీపర్లు, లడ్డూ కౌంటర్ల వద్ద ఎవరు ఎలాంటి విధులు నిర్వర్తిస్తున్నారో ఎవరికీ అర్థం కాకుండా ఉంది.

ఆరునెలలు గడిచినా..

- ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్‌, సూపరింటెండెంట్లు శ్రీనివాసశర్మ, రాజేశ్వర్‌రావు ఇటీవల బదిలీ అయ్యారు.
- వీరు ఉన్నప్పుడు అంజన్న జయంతి, ఇతర వేడుకల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.
- ఏర్పాట్లు, ఇతర సౌకర్యాలపై వీరే పూర్తిఅవగాహన ఉండేది.
- వీరు బదిలీ అయి ఆరునెలలు గడిచినా వారి స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.
- కొండగట్టు ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం కేసీఆర్‌.. అవినీతి అధికారులను తొలుత బదిలీ చేస్తారని సమాచారం.
- ఉన్నవారిలో ఇలాంటివారు బదిలీపై వెళ్తే ఇంకా మిగిలేది ఎవరుంటారనే విషయంపై చర్చ జరుగుతోంది.
- అంతేకాదు.. వచ్చే ఉత్సవాల నిర్వహణకు మరికొంతమంది ఉద్యోగులను నియమించాలనే డిమాండ్‌ వస్తోంది.

పూర్తిస్థాయి సిబ్బంది ఉండాలి

మాకు ఏవైనా సమస్యలు ఎదురైతే ఎవరికి చెప్పుకోవాలో తెలియడంలేదు. సిబ్బంది అందుబాటులో ఉండరు. ఇలాగైతే ఎలా? – జి.రవితేజ, భక్తుడు, మల్యాల

కాంట్రాక్ట్‌ విద్యుత్‌ ఉద్యోగికి తీవ్ర గాయాలు

రామగిరి(మంథని): తెగిపోయిన విద్యుత్‌ లైన్‌కు మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు మరో విద్యుత్‌ వైరు తగిలి విద్యుత్‌దాఘాతంతో ఓ కాంట్రాక్ట్‌ ఉద్యోగికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. వ్యవసాయ బోర్లకు విద్యుత్‌ సరఫరా చేసే 11 కేవీ విద్యుత్‌ లైన్‌ ముత్తారం శివారులోని గుల్లకుంట వద్ద తెగిపోయింది. సమాచారం అందుకున్న సిబ్బంది సోమవారం అక్కడికి వెళ్లి, మరమ్మతు చేస్తుండగా కాల్వశ్రీరాంపూర్‌ విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ నుంచి వచ్చే విద్యుత్‌ తీగ రాపెల్లి నాగరాజుకు తగలడంతో విద్యుదాఘాతం సంభవించింది. ఈ ఘటనలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. సబ్‌స్టేషన్‌లో ఫీజు కొట్టివేయడంతో ప్రాణాపాయం తప్పింది. తోటి సిబ్బంది నాగరాజును కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్‌ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.